గ్రంథ పురస్కారాలకు సలహాలు, సూచనలకు ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, మార్చి 17: తెలంగాణ సారస్వత పరిషత్తు 2024వ సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయి గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలను ఆహ్వానిస్తున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2022, 2023వ సంవత్సరాలలో తొలిసారి ముద్రణ పొందిన పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున పంపించాలని సూచించారు. పద్య, గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, సాహిత్య విమర్శ, ఇతరాలు, యువ పురస్కారం అనే ఏడు విభాగాలలో పురస్కారాలు అందజేస్తామన్నారు. తెలంగాణ ప్రాంతం వారే పోటీకి గ్రంథాలను పంపించడానికి అర్హులుగా పేర్కొన్నారు. కవిత్వం 60 పుటలకు, మిగతా ప్రక్రియలలో పుస్తకాలు 100 పుటలకు తక్కువ ఉండరాదన్నారు. పాఠకులు తమకు నచ్చిన పుస్తకాన్ని పురస్కారానికి పరిశీలించవలసినదిగా ఆయన సూచించారు. పుస్తకం పేరు, రచయిత పేరు, ముద్రణ పొందిన సంవత్సరం, పుటల సంఖ్యను పేర్కొంటూ పాఠకులు సూచనలు పంపించవచ్చన్నారు. యువ పురస్కారానికి 20 – 35 ఏళ్ళ మధ్య వయసు ఉన్నవారు తమ రచనలను మూడేసి ప్రతుల చొప్పున పంపించాలని సూచించారు. ఇతర వివరాలకు 96037 27234లో సంప్రదించవచ్చన్నారు.

వేసవిని తట్టుకునేలా..

- పాత వాటి స్థానంలో సామర్థ్యం పెంపు
- డిమాండుకు అనుగుణంగా నిరంతర విద్యుత్
- క్షేత్ర స్థాయిలో వేసవి కార్యాచరణ అమలు

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ): వేసవిలో డిమాండుకు అనుగుణంగా నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) చర్యలు చేపట్టింది. వేసవి కార్యాచరణలో భాగంగా క్షేత్ర స్థాయిలో వివిధ ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న లోడును ముందే గుర్తించిన అధికారులు అదనంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, ఉన్న వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు కార్యాచరణను రూపొందించారు. ఇందుకు ఆయా సర్కిళ్ల పరిధిలోని సెక్షన్లలో గత ఫిబ్రవరి నెలలోనే అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాట్లు, కొత్త లైన్లు, సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అంచనాలను రూపొందించి అనుమతుల కోసం కేంద్ర కార్యాలయానికి పంపించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న ఉన్నతాధికారులు ప్రాధాన్యత క్రమంగా ఎక్కువ లోడ్ ఉన్న ప్రాంతాల్లో వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని సర్కిల్ అధికారులు పేర్కొంటున్నారు. వేసవి కార్యాచరణ కోసం టీఎస్ఎస్పీడీసీఎల్ ప్రత్యేకంగా బడ్జెట్‌ను సైతం కేటాయించడంతో స్టోర్స్ నుంచి అవసరమైన సామగ్రిని ఆయా సర్కిళ్ల పరిధిలోని సెక్షన్‌లకు పంపిస్తున్నారు. వేసవి కార్యాచరణలో భాగంగానే గత శనివారం రాత్రి వేళల్లోనే రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఇలా ముందుగా అంచనాలు రూపొందించిన ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేస్తూ విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తున్నామని తెలిపారు.

అంతరాయాలకు అవకాశం లేకుండా...

వేసవి వచ్చిదంటే చాలు విద్యుత్ శాఖపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. పెరుగుతున్న డిమాండుకు అనుగుణంగా కొత్త లైన్లను వేయడంతో పాటు ఉన్నవాటిపై అధిక లోడు పడకుండా సెక్షన్ స్థాయిలో ఏఈ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తూ, విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా ఉండేందుకు అవసరమైన చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా చేస్తున్నారు. వినియోగంలో ఉన్న సర్వీసులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడటమే ప్రధాన లక్ష్యంగా చేసుకొని ప్రతి సెక్షన్‌లో విద్యుత్ సరఫరా తీరుతెన్నులను పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా వేసవి నేపథ్యంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సైతం స్వయంగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్నారు. గత సోమవారం మెట్రో జోన్ పరిధిలోని సబ్‌స్టేషన్లను ఇన్‌చార్జి డైరెక్టర్ ఆపరేషన్స్, మెట్రో జోన్ సీజీఎం నరసింహులుతో కలిసి తనిఖీ చేశారు. సబ్ స్టేషన్ నిర్వహణ, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న లోడ్, ఫీడర్ల నిర్వహణ అంశాలను పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, విద్యుత్ సరఫరాలో విషయంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఆదేశించారు. వేసవి ముగిసే వరకు ఇదే విధమైన పనితీరును కనబర్చి మెరుగైన విద్యుత్ సరఫరాను అందించే కార్యాచరణను అన్ని సర్కిళ్ల పరిధిలో అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలో కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

శంషాబాద్ పట్టణంలోని సీపీఐ శిక్షణ తరగతి ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, తదితరులు

మతం, దేవుడి పేర బీజేపీ ఓట్లు దండుకునే యత్నం

శంషాబాద్ రూరల్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మతం, దేవుడి పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తుందని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శంషాబాద్ పట్టణంలో సీపీఐ రంగారెడ్డి జిల్లా నాయకులకు, కార్యకర్తలకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారం కోసం దేవుడు, మతం పేరుతో ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నదని వివరించారు. 400 సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పుతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి దేశ ప్రజలు ఎన్నికల్లో ఓట్ల ద్వారా తగ్గిన బుద్ధి చెప్పాలని సూచించారు. దేశంలో ఎక్కడ చూసినా బీజేపీ నాయకులు అట్టడుగు వర్గాల ప్రజలపై దాడులు చేస్తున్నారని, బీజేపీకి మరోసారి అధికారం కట్టబెడితే దేశం అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోతుందని తెలిపారు. దేశంలోని ప్రతి పేదవాడికి మూడు పూటలా అన్నం దొరికే విధంగా పోరాటాలు చేసే ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, పుస్తకాల నర్సింగరావు, సైయ్యద్ అప్పర్, మండల కార్యదర్శి నర్రగిరి, ఏఐటీయూసీ నాయకులు జైపాల్ రెడ్డి, దత్తు నాయక్‌లతో పాటు సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్జ్యూమర్ రైట్స్ నేషనల్ మీట్‌లో..

మారేడ్‌పల్లి, మార్చి 17: ఢిల్లీలో జరిగిన కన్జ్యూమర్ రైట్స్ అర్గనైజేషన్ 14వ నేషనల్ మీట్ కార్యక్రమంలో జంట నగరాలకు చెందిన పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హరిబాబు, కంటోన్మెంట్ నియోజకవర్గ అధ్యక్షులు చొల్లేటి రమేష్, కవాడిగూడ ప్రాంతానికి చెందిన ప్రభాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులు, వారి విధులు తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశం ద్వారా పలు అంశాలపై అవగాహన కల్గిందని చొల్లేటి రమేష్ తెలిపారు.

ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న హరిబాబు, చొల్లేటి రమేష్ తదితరులు

బయోగ్యాస్ అప్‌గ్రేడేషన్‌పై ఐఐసీటీ కృషి

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ): తరిగిపోని, జీరో కార్బన్ ఎమిషన్ లక్ష్యంగా ఇంధన వనరులపై పరిశోధనలు ముమ్మరంగా సాగుతూనే ఉన్నాయి. తాజాగా బయోగ్యాస్‌ను వాణిజ్యపరంగా తక్కువ వ్యయంతో అధికంగా ఉత్పత్తి చేసే విధానాలపై ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు డా.ఎస్.వెంకటమోహన్ కృషి చేస్తున్నారు. ప్రస్తుతం, పరిశోధన దశలో ఉండగా, బయోగ్యాస్ అప్‌గ్రేడేషన్ సాధ్యం అవుతుందని, దీంతో వాణిజ్య పరంగా బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు అవసరమైన టెక్నాలజీ ఆధునీకరణపై దృష్టి పెట్టారు. కర్బన వ్యర్థాలను తగ్గించడమే లక్ష్యంగా బయోగ్యాస్ ఉత్పత్తి చేసే విధంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

వెలమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయండి

- మంత్రి జూపల్లికి ఐవా ప్రతినిధుల వినతిపత్రం

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ): అఖిల భారత వెలమ సంఘం (ఐవా) కార్యవర్గ సభ్యులు ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో వివిధ కులాలకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్లలో వెలమ కార్పొరేషన్ లేదని, వెలమలలో అత్యధికంగా 95 శాతం మంది పేద వెలమలు ఉన్నారని మంత్రికి వినతిపత్రం ద్వారా వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి జూపల్లి పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి వెలమ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఐవా ప్రతినిధులకు మంత్రి హామీ ఇచ్చారు. ఐవా ఉపాధ్యక్షులు నీలగిరి దివాకర్ రావు ఆధ్వర్యంలో ఉపాధ్యక్షులు తాండ్ర శ్రీనివాస్ రావు, మహిళా ఉపాధ్యక్షురాలు గోనె శ్రీలత, కోశాధికారి హరీష్ రావు, మాజీ ఉపాధ్యక్షులు సంకినేని జగన్‌రావు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గ్రూప్స్ ఉద్యోగాలను లెక్కించి భర్తీ చేయాలి: ఆర్.కృష్ణయ్య

మలక్‌పేట, మార్చి 17: గ్రూప్-1, 2, 3, 4 సర్వీస్ ఉద్యోగాలను పూర్తి స్థాయిలో లెక్కించి భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ 23 జిల్లాల్లోని 40 శాఖల జిల్లా, తాలూకా, కార్యాలయాలు, 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, 76 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 25 డీఎస్పీ కార్యాలయాలు, 31 పోలీస్ సర్కిళ్లు, 7 కమిషనరేట్లు, 4383 గ్రామ పంచాయతీ కార్యాలయాలు కొత్తగా ఏర్పడ్డాయని వాటన్నింటిలో అన్ని రకాల పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్నారు. ప్రస్తుతం, గ్రూప్-1 కింద 503 పోస్టులు, గ్రూప్-2 కింద 783 పోస్టులు, గ్రూప్-3లో 1383 పోస్టులు, గ్రూప్-4లో 8500 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారని, అయితే డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా పోస్టులను సరిగ్గా లెక్కిస్తే, గ్రూప్-1లో 1600ల పోస్టులు, గ్రూప్-2లో 2 వేలకు పైగా, గ్రూప్-3లో 3 వేలకు పైగా గ్రూప్-4లో 25 వేలకు పైగా పోస్టులు ఉంటాయన్నారు. ఒకే దఫా గ్రూప్-1, 2, 3, 4 టీచర్, లెక్చరర్, ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేస్తున్నందున మెరిట్ అభ్యర్థులు ఈ పోస్టులన్నింటికి సెలెక్ట్ అవుతారని, అన్ని రకాల 6, 7 కెటగిరీల పోస్టులకు ఒకేసారి సెలెక్ట్ అయితే ఆ అభ్యర్థి ఒకే పోస్టును ఎంపిక చేసుకుంటారని, మిగతా 5, 6 రకాల పోస్టులు మిగిలిపోతాయని తెలిపారు. ఇప్పుడున్న పద్ధతి ప్రకారం, ఇతర అభ్యర్థులకు ఎలాంటి ఉద్యోగాలు రాకుండా పోతాయని పేర్కొన్నారు. ఆప్షన్, వెయిటింగ్ లిస్టు కాల పరిమితి పెట్టి ఉద్యోగాలను భర్తీ చేస్తే అందరికీ అవకాశం లభిస్తుందని, పోస్టులు మిగిలిపోకుండా భర్తీ అవుతాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గురుకుల, ఆదర్శ పాఠశాలల) పోస్టులు వేర్వేరుగా నియామకాలు చేపట్టడం ద్వారా మెరిట్ అభ్యర్థులు, మూడు, నాలుగు రకాల యాజమాన్యాల పాఠశాలలో మెరిట్ ఉన్న ఒకే అభ్యర్థి సెలెక్ట్ అవుతారని, మిగతా పోస్టులు వృథాగా ఉండిపోతాయని ఆయన వివరించారు. ఆప్షన్, వెయిటింగ్ లిస్ట్ పెట్టడం ద్వారా అన్ని ఫలితాలు ఒకేసారి ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అనురాగ్ వర్సిటీ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య

పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలి

ఘట్‌కేసర్, మార్చి 17: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపురంలోని అనురాగ్ యూనివర్సిటీలో శనివారం రాత్రి 2024 వార్షిక వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సమ్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం పలు కారణాలతో వాతావరణ కాలుష్యం ఏర్పడి పర్యావరణానికి సవాల్‌గా మారిందన్నారు. దీనికి విద్యార్థులు కదంతొక్కి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ చైర్మన్, శాసన సభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు, పరిసర ప్రాంతాల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభను చూపిన విద్యార్థులకు చైర్మన్ సన్మానం చేశారు. వీసీ ప్రొఫెసర్ రాంచంద్రన్, రిజిస్ట్రార్ డాక్టర్ బాల్‌రాజ్ ఉట్ల, సీఈఓ నీలిమ, డీన్లు డాక్టర్ ముత్తారెడ్డి, విజయ్ కుమార్, విష్ణుమూర్తి, సుధీర్‌రెడ్డి, సతీష్ కుమార్, ప్రసన్న, నారాయణరెడ్డి, వసుధ, కార్యక్రమ నిర్వాహకులు ప్రొఫెసర్ శ్రీనివాస చలపతి, డాక్టర్ తారాసింగ్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ మల్లేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాధికార మహిళలకు పురస్కారాలు

- ఎంపవర్డ్ వుమెన్ అవార్డ్స్ – 2024 ప్రదానం



సదస్సులో ఎంపవర్డ్ వుమెన్ అవార్డ్స్-2024 పొందిన మహిళలు

అమీర్‌పేట, మార్చి 17: వివిధ రంగాల్లో సత్తా చాటుకుంటూ ప్రత్యేక గుర్తింపుతో దూసుకుపోతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న 50 మంది మహిళలను ఎంపవర్డ్ వుమెన్ అవార్డ్స్ (సాధికార మహిళా పురస్కారాలు) -2024 పేరుతో ఘనంగా సత్కరించారు. బేగంపేట్‌లోని హోటల్ ప్లాజాలో ముందడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' అనే అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో భాగంగా తమదైన ప్రతిభతో దూసుకుపోతున్న జర్నలిస్టులు, నటీమణులు, యూట్యూబర్లు, మహిళా రైతులు, అధ్యాపకులు, సామాజికవేత్తలతో పాటు ఇతర రంగాల్లో రాణిస్తున్న వారిని ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ మాజీ అదనపు కార్యదర్శి, రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివ కుమార్ గౌడ్, సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, ముందడుగు ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాజేంద్రలు అవార్డులతో ఘనంగా సత్కరించారు. మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని, మహిళా భాగస్వామ్యం లేని రంగం కనిపించడం లేదని, మెరుగైన సమాజానికి మహిళల్లో ప్రశ్నించే తత్వం మరింత పెరగాల్సిన అవసరం ఉందని సదస్సులో వక్తలు అభిప్రాయపడ్డారు. అవార్డులు పొందిన వారిలో మహిళా జర్నలిస్టులు స్వాతి శర్మ, రేష్మి చక్రవర్తి, హేమ, మౌనికారెడ్డి, శ్రద్ధ విజయలక్ష్మి, రేష్మి, శిఖా దుగ్గల్, నేహా సోని, తేజస్వినిలు ఉన్నారు.

ప్రకృతిపై అత్యద్భుతంగా కళాకృతులు

'ఫ్రమ్ ది షట్టర్ స్టెప్పింగ్ ఔట్' ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన శిల్పాలు

సుల్తాన్ బజార్, మార్చి 17: కళలకు కాదేది అనర్హమని స్కల్ప్చర్ విభాగం విద్యార్థులు రూపొందించిన శిల్పాలు ప్రతి ఒక్కరిని ఆలోచింప జేస్తున్నాయి. మాసబ్ ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోని స్కల్ప్చర్ విభాగం ఫైనల్ విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యను, ప్రతిభతో రూపొందించిన 'ఫ్రమ్ ది షట్టర్ స్టెప్పింగ్ ఔట్' ఆర్ట్ ఎగ్జిబిషన్ ఆదివారం ముగిసింది. సమాజంలో చోటు చేసుకుంటున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన శిల్పాకృతులు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేశాయి. ఫైనల్ ఇయర్ విద్యార్థులు తయారు చేసిన శిల్పాలలో ప్రధానంగా

ముగిసిన 'ఫ్రమ్ ది షట్టర్ స్టెప్పింగ్ ఔట్' ఆర్ట్ ఎగ్జిబిషన్

రాబోయే తరంలో ప్లాస్టిక్ భవనాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నట్లు, రోడ్లపై, వీధి చివరలో గోడలపై అపరిశుభ్ర వాతావరణం కల్పించేలా చేస్తున్న దృశ్యాలు ప్రతి ఒక్కరిని ఆలోచింప జేశాయి. ఇవే కాకుండా ఈ జీవావరణంలో చోటు చేసుకుంటున్న పలు స్థితిగతుల ఆధారంగా రూపొందించిన శిల్పాల ప్రదర్శన తిలకించేందుకు వస్తున్న వారిని కట్టిపడేస్తుంది.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తున్నాం

– కాంతారెడ్డి, స్కల్ప్చర్ విభాగం కో ఆర్డినేటర్, జేఎన్ఏఎఫ్ఏయూ

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలను నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు విద్యాభ్యాసం సమయంలో తాము నేర్చుకున్న శిక్షణను, ప్రకృతిలో జరుగుతున్న ఘటనల ఆధారంగా శిల్పాలను రూపొందించారన్నారు. విద్యార్థులు తమ పరిసరాలలో, తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శన రూపంలో ఉంచారు.

గ్రేటర్‌కు భారీ వర్ష సూచన

- ఎల్లో హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ కేంద్రం

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ): ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లో ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, ద్రోణి ప్రభావంతో చల్లబడిన నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 33.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 23.7 డిగ్రీలు, గాలిలో తేమ 46 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా కృషి

మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ విజ్జుల్లత

జూబ్లీహిల్స్, మార్చి 17: వ్యక్తిగత అంశాలను చర్చించేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు మహిళలు ఉమ్మడిగా కృషి చేయాలని, అందుకు సహోద్యోగులు చేదోడు వాదోడుగా ఉండాలని తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎం.విజ్జుల్లత పేర్కొన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ మహిళా విభాగం ప్రథమ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఓయూ జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పద్మజా షా మాట్లాడుతూ పబ్లిక్ రిలేషన్స్‌లో భాగమైన సంక్షోభ నియంత్రణ (క్రైసిస్ మేనేజ్మెంట్) మహిళలకు ఉండే సహజ సిద్ధమైన నైపుణ్యమని చెప్పారు. సభలో సీనియర్ జర్నలిస్ట్ సి.వనజ మాట్లాడుతూ, వృత్తిలో ఉండే సమస్యలను ఉమ్మడిగా ఎదుర్కొనేందుకు మహిళలు సంఘటితంగా పనిచేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన మహిళా విభాగం కన్వీనర్ డాక్టర్ అనిత మాట్లాడుతూ, దేశంలో ఎక్కడాలేని విధంగా పీఆర్ఎస్ఐలో మహిళల కోసం ఒక ప్రత్యేకమైన విభాగాన్ని ఆరంభించిన ఘనత హైదరాబాద్ చాప్టర్‌దేనన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణకు ఇతోధిక సహకారం అందించిన ఎన్ఎండీసీ అధికారి శ్రీనివాస రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ డాక్టర్ శ్రీబాల, కో ఆర్గనైజర్ ధన్యా చౌదరి, సలహాదారులు సి.రమాదేవి, ఆనందిత ముఖర్జీ సిన్హా, రాజేశ్వరి అయ్యర్, సంయుక్త కార్యదర్శి అపర్ణ రాజహంస, ఈసీ మెంబర్ సాజిదా ఖాన్‌తో పాటు హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రాము, కార్యదర్శి కె.యాదగిరి, కృష్ణబాజీ, రవీందర్ రెడ్డి, మహేష్ బుడగం, భుజంగరావు, వై.బాబ్జీ, మోహన రావు, శ్రీకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృత్తి నిపుణులు నాగ స్వప్న వాయువేగుల (టీసీపీ వేవ్ ప్రైవేట్ లిమిటెడ్), శ్రీలక్ష్మి కొడుకుల (మెడికవర్ హాస్పటల్), డాక్టర్ ఉషా అయ్యర్ (డాక్టర్ రెడ్డీస్ లేబోరేటరీస్ లిమిటెడ్), ముక్తా కుమార్ (కోనక్షన్స్ ఇమేజ్), తేజస్విని పడగడల (టెక్ డోక్వెస్ట్), కొత్తపల్లి ప్రసన్న (జెనెసిస్ బీసీడబ్ల్యూ), అరుణ బుద్ధవరపు (జస్ట్ కార్పొరేట్ కమ్యూనికేషన్స్), అభ్యుదయ కారంచేటు (వెల్స్ ఫార్గో), డిల్గోరిస బారువా (అరెటీన్స్ టెక్) లను ఘనంగా సన్మానించారు.

జిల్లా ఏర్పాటుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి

సిటీబ్యూరో, మార్చి 17(నమస్తే తెలంగాణ): ప్రత్యేక జిల్లా ఏర్పాటుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి సాధ్యమని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని రూపొందించిన పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జీహెచ్ఎంసీ డివిజన్లతో కలిపి సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలను సమర్పించినట్లు పవన్ చెప్పారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులను కలిసి జిల్లా సాధన ఉద్యమానికి మద్దతు కోరుతున్నట్లు చెప్పారు. నూతనంగా సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటయ్యే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని

తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాదం బాల్‌రాజ్ యాదవ్, ఉపాధ్యక్షులు శైలేందర్, కృష్ణ సాగర్, అశోక్, సునీల్ పాల్గొన్నారు.

కొమురెల్లి మల్లన్నకు పసిడి హారం

చేర్యాల, మార్చి 17: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో నిండిపోయింది. 9వ వారం సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని పరవశించి పోయారు. స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు 35 వేల మంది భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ తెలిపారు.

జి.ఆలయ చైర్మన్‌కు బంగారు రుద్రాక్షమాల అందజేస్తున్న భక్తుడు ఉమరాజ్ యాదవ్

9వ వారానికి 35 వేల మంది భక్తుల రాక

మల్లన్నకు బంగారు రుద్రాక్షమాల

కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి వారికి నగరంలోని బోయినపల్లి ప్రాంతానికి చెందిన భీమబోయిన ఉమరాజ్ యాదవ్ 842 గ్రాముల బంగారు రుద్రాక్షమాలను సమర్పించాడు. స్వామి వారి 9వ వారం సందర్భంగా భక్తుడు ఉమరాజ్ యాదవ్ సమర్పించిన బంగారు రుద్రాక్షమాలను ఆలయ అర్చకులు స్వామి వారి వద్ద పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, సదరు బంగారు కానుకను ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్వాటకం లక్ష్మారెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్‌లకు అందజేశార